విశాలాంధ్ర
అనకాపల్లి
ఆదివారం 12, మే, 2024

వాహనాలతో రద్దీగా టోల్ ప్లాజాలు

విశాలాంధ్ర - నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు వారి వారి సొంత గ్రామాలకు ఓటు వేసేందుకు పయనమయ్యారు. కార్లు ఇతర వాహనాల్లో సిద్ధమైతే కొంతమంది బస్సుల్లో ప్రయాణమయ్యారు. వీరు రాకపోకల వల్ల మండలంలోని వేంపాడు - కాగితా టోల్ ప్లాజా వద్ద పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోతున్నాయి. సంక్రాంతి పండక్కి చూసాం మళ్లీ ఎన్నికల వాతావరణానికి ఈ వాహనాలు తాకిడి కనిపించింది.

మీడియా సాక్షిగా ప్రత్యేక హోదాపై సీఎం రమేష్ మౌనం

విలేకరుల ప్రశ్నలకు బదులు ఇవ్వకుండానే ప్రెస్‌మీట్ ముగింపు

ప్రత్యేక హోదాకు బీజేపీ మంగళం పాడిందా...?

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: మాటలతో మభ్య పెట్టాలని, చెప్పిన అబద్ధాన్ని పదేపదే చెపితే నిజమైపోతుంది అనే భ్రమలో కూటమి బలపరిచిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఉన్నట్లు శనివారం జరిగిన విలేకరుల సమావేశం సాక్షిగా బట్టబయలు అయింది. రానున్న ఎన్నికలలో అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి తాను లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే అన్నీ సర్వేలలో గెలుపు పక్కా అని తేలిందన్నారు. ఓటింగ్ శాతం పెరిగితే మెజారిటీ మరింత పెరిగే అవకాశం ఉంటుందని ఆరు సర్వే సంస్థలు ఇచ్చిన నివేదిక ఆధారంగా చెబుతున్నానని అతని వివరించారు. అంతేకాకుండా తాము ప్రముఖ సంస్థలతో నిర్వహించిన సర్వే ప్రకారం అనకాపల్లి జిల్లాలోని 7 నియోజకవర్గాలలో కూడా కూటమి అభ్యర్థులు మెజారిటీతో గెలవబోతున్నారని వెల్లడించారు. అందువలన కూటమి నాయకులు, కార్యకర్తలు అందరూ మరింత కష్టపడి ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై బీజేపీ స్టాండ్ ఏమిటని ప్రశ్నించగా నమస్తే ఉంటాను అంటూ ప్రెస్‌మీట్ నుంచి వెళ్లిపోవడం చూస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంలో బిజెపి ఇప్పటికీ తీరని అన్యాయం చేస్తుందనే అర్థమవుతుంది. చిలకలూరిపేట, తాళ్లపాలెం ఎన్నికల సభలో పాల్గొన్న మోడీ కూడా ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తకపోవడం చూస్తే మరోమారు బిజెపి రాష్ట్రానికి అన్యాయం చేస్తుందనే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతుంది. సీఎం రమేష్‌ను బీజేపీ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన నాటినుండి నేటి వరకు ఆయన ప్రవర్తన, మాటలు వింతగా, విడ్డూరంగా ఉన్నాయంటూ మరో మారు తేటతెల్లమయింది. అనకాపల్లిలో నిరుద్యోగ సమస్య రూపుమాపడానికి అదాని, అంబానీ లాంటి ప్రముఖులతో ఇప్పటికే మాట్లాడినట్లు వారు కూడా అంగీకరించి సీఎం రమేష్ ఎంపీ అయిన వెంటనే పరిశ్రమలు అనకాపల్లిలో ఈ ఏర్పాటు చేయడానికి అంగీకరించినట్లు సీఎం రమేష్ చెప్పడం, దానిపై విలేకరులు జోకులు వేసుకోవడం కొసమెరుపు... చెబుతున్నది అబద్ధమని, అందులోనూ విలేకరులతో మాట్లాడుతున్న విషయాన్ని మరిచిపోయి చాలా అద్భుతంగా అబద్ధాలు చెప్పడంలో, రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయంపై అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేయడం సీఎం రమేష్‌కే దక్కుతుంది.. ఎందుకంటే ఎంతైనా ఆయన సీఎం రమేష్ కదా...

ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు జిల్లాలో అవసరమైన ఏర్పట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్ శెట్టి తెలిపారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణతో కలసి పాల్గొన్నారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, ప్రతి ఓటరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని చెప్పారు. జిల్లాలో 1529 పోలింగు కేంద్రాలున్నాయని, 12 లక్షల 89 వేల 371 మంది ఓటర్లు వున్నారని వారిలో 6,27,321 మంది పురుషులు, 6,62,022 మంది మహిళలు కాగా 28 మంది థర్డ్ జండర్ వున్నారని చెప్పారు. పోలింగ్ సిబ్బంది పి.వో.లు 1759 మంది, ఏపీఓలు 1743 మంది, ఓపీఓలు 7036 మంది సూక్ష్మపరిశీలకులు పాల్గొంటున్నట్లు వెల్లడించారు. 3666 బ్యాలట్ యూనిట్లు, 3666 కమిషనింగ్ యూనిట్లు, 3968 వివి పాట్‌లు, 25 టీమ్‌లు, 101 బియూ, 127 సియూ, 139 వివిపాట్‌లు రిజర్వుగా ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ఎసిసిలో 25 టీమ్‌లు, 55 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 6 వీడియో సర్వేలెన్స్, 54 స్టాటిక్ సర్వైలన్స్, 7వీడియో వీవింగ్ టీమ్‌లు, 7 అక్కౌంటింగ్ టీమ్‌లు, 7 అసిస్టెంట్ ఎక్స్ పెండీచర్ టీమ్‌లు 157 సెక్టోరల్ అధికారులు 145 రూట్ అధికారులు పాల్గొంటున్నారని చెప్పారు. 1529 పోలింగ్ కేంద్రాలలో 340 సమస్యాత్మక కేంద్రాలు వుండగా 380 మంది సూక్ష్మ పరిశీలకులను నియ మించడం జరిగిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసు సూపరింటెండెంట్ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా బందోబస్తులో కేంద్ర బలగాలు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. రౌడీషీటర్స్, ఇబ్బందులు కలిగించే వారిని గుర్తించి అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో 144, 30 పోలీస్ యాక్ట్ అమలులో వుందన్నారు. చెక్ పోస్టులను మరింత పటిష్టం చేశామన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమెన అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు.

చర్చించి నిర్ణయించాకే

కూటమికి మద్దతు ఇచ్చాం

ఉత్తర కోస్తా ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి జిల్లాల అధ్యక్షులు ముమ్మడి వరపు చినసుబ్బారావు

విశాలాంధ్ర - గొలుగొండ: ఎస్సీ వర్గీకరణకు అన్ని రాష్ట్రాలు తీర్మానాలు చేసినప్పటికీ ఆంధ్ర రాష్ట్రం నుండి ఎటువంటి తీర్మానం చేయకుండా జగన్మోహన్ రెడ్డి మాదిగల మనోభావాలను గుర్తించనందున, గతంలో 2005 వరకు ఎస్సీవర్గీకరణ విభజన ఫలాలతో 27,500 పోస్టు సాధించుకున్నందున కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో తెలుగుదేశం నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉన్నట్లయితేనే వర్గీకరణకు అనుకూల తీర్మానం ఇచ్చే అవకాశం ఉన్నందున కూటమికి మద్దతు ఇవ్వాలని మందకృష్ణ మాదిగ ఐదువేల మందితో చర్చించి నిర్ణయం తీసుకున్నారని ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి ఉమ్మడి ఉత్తర కోస్తా జిల్లాల ఇన్చార్జ్ ముమ్మడి వరపు చినసుబ్బారావు మాదిగ, అల్లూరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు డాక్టర్ నిడమర్రి చినరాజు తెలియజేశారు. మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల నుండి మాదిగ జాతి గురించి చేసిన పోరాట ఫలితంగానే నవంబర్ 11న భారత ప్రధాని నరేంద్ర మోడీ విశ్వరూప మహాసభలో వర్గీకరణపై ప్రకటించడం జరిగిందన్నారు. కూటమికి మద్దతు ఇచ్చే విషయంలో మంద కృష్ణ మాదిగ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేదని వివరించారు. ఆరుగుళ్ళ రాజబాబు, పెదపూడి శివ సత్యనారాయణకు, నతీష్‌కు ఇతరులకు ఎమ్మార్పీఎస్‌లో ఎటువంటి పదవులు లేవని ఎమ్మార్పీఎస్‌ను అడ్డుపెట్టుకొని తిరిగే వ్యక్తులపై అన్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

పద్ధతి మార్చుకోకపోతే ఆరుగుళ్ల రాజబాబు ఇంటి వద్ద తన బారినపడ్డ బాధితులచే టెంట్ వేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు వేమగిరి అర్జున, అల్లూరి జిల్లా మీడియా కోఆర్డినేటర్ చిట్టిబాబు ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు పల్లపాటి నాగేశ్వరరావు, మిట్టపల్లి అనిల్, గజ్జలకు అప్పారావు, కుందూరు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పోతే తాము ఎలా బతకాలి

విశాలాంధ్ర - యలమంచిలి/రాంబిల్లి: మండలంలోని పెద్దకలవలపల్లి ఎన్ఏఓబీ నిరసన శనివారానికి 200 రోజులు పూర్తి అయినా అధికారుల నుండి స్పందన లేకపోవడం చాలా బాధాకరం అని మాజీ ఎంపీటీసీ రావి దేముల్లు అన్నారు. కనీసం ఈ మండల అధికారులు కళ్ళు కనిపించడం లేదా అని నిలదీశారు. పెద్దకళవలపల్లి రైతు కూలీలు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రావి దేముల్లు, సింహాచలంలు మాట్లాడుతూ కోటకొండలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ కొండల చుట్టూ ప్రహరి కట్టేస్తే ఈ గ్రామంలో ఉపాధి పోతుందని పేదలు ఎలా బ్రతకాలి అని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగలక్ష్మి, యలమంచిలి వారాలు, మరిశెట్టి చిలకమ్మా, బొదుపు పెద్దబుల్లి, ఆ గ్రామ మహిళా కూలీలు పాల్గొన్నారు.

నోటుకు అమ్ముడుపోతున్న ఓటరు

విశాలాంధ్ర - చోడవరం: భవిష్యత్తు మార్పు, రాజ్యాంగ హక్కు కలిగి భావి తరాలకు దిశ నిర్దేశాన్ని కల్పించే వజ్రాయుధం వంటి ఓటును ప్రజలు వెయ్యి రూపాయిలు, క్వార్టర్ మందుకు అమ్మేసుకుంటున్నారు. వై.సి.పి., టి.డి.పి.లు ఒకే మాటగా శనివారం ఇంటింటికీ తిరిగి విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారు. ఈ.సి. నిభందనలంటూ పత్రికలకు ప్రకటనలిచ్చిన ఎన్నికల అధికారులు, పోలీసులు రాజకీయ పార్టీల డబ్బు, మద్యం పంపిణీ, ప్రలోభాలను కట్టడి చేయలేకపోతున్నారా, లేక వారు కూడా రాజకీయ నేతల డబ్బుకు దాసోహం అయ్యారా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. లోకం మారక పోయినా, నాకు నేను మారానంటూ బూర్జువా రాజకీయాలను వదలిపెట్ట కపోతే భావి తరాలు క్షమించవు. ఆపై ప్రతీ ఒక్కరూ పాడేది నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని" అనుకొవడమే తప్ప, కార్పొరేట్లు, ఆర్థిక నేరగాళ్ల, చీకటి మిత్రుల ఆదేశాలకు లోబడి ఉండా ల్సిందే అని సీనియర్లు హెచ్చరి స్తున్నారు. నేటి కైనా రూపాయి, పావ లాకు ఓటును అమ్మకుండా స్వచ్ఛందంగా, గుండెలపై చేయి వేసుకుని రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కు ను సద్విని యోగం చేసుకోవాలని పలువురు మేధావులు, సీనియర్లు, స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తాం

వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు

విశాలాంధ్ర - నక్కపల్లి: గత ప్రభుత్వాలు ఎన్నడు లేని విధంగా ఈ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి చెందిందని అభివృద్ధిని చూసి ఓటు వేయాలని వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు అన్నారు. చివరి రోజు ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం నక్కపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు మాట్లాడుతూ సోమవారం జరిగే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమం పథకాలు అందాయని తెలిపారు. సంక్షేమ పథకాలలో భాగంగా గ్రామాల్లో గ్రామ సచివాలయాలు రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. వృద్ధులకు వికలాంగులకు పెన్షన్ విషయంలో ప్రతినెలా ఒకటో తారీకు జరిగిన ఇంటింటికి అందించేందుకు జగన్మోహన్ రెడ్డి ఎంతో కృషి చేశారని ఇదే ప్రభుత్వం రావాలంటే ప్రతి ఒక్కరూ వైయస్సార్ పార్టీ గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు వీసం రామకృష్ణ, సీరం నరసింహమూర్తి, బొల్లం చలపతిరావు, వైస్ ఎంపీపీ వీశం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా

అమల్లోకి వచ్చిన 144 సెక్షన్

విశాలాంధ్ర - చోడవరం: సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు రక్షణ శాఖ ముందుగానే సి.ఆర్.పి.సీ. 144 సెక్షన్ ను శనివారం సాయంత్రం నుండి 14 తేది (సోమవారం) ఉదయం వరకు అమల్లో వుంటాయని చోడవరం పోలీస్ ఉన్నతాధికారులు శనివారం ఓ ప్రకటన లో తెలియజేసారు. ప్రభుత్వ నిషేధాజ్ఞలు ఉల్లంఘించే ఏ వ్యక్తి అయినా నిభందనలు ప్రకారం శిక్షింపబడతారు అని తెలిపారు. 144 సెక్షన్ అమల్లో చట్ట విరుద్ధ మైన సమావేశాలు, బహిరంగ సమావేశాలు, ర్యాలీ నిర్వహించనున్నారు. జిల్లాలోని నియోజకవర్గాల ఓటర్లు కాని ఓటర్లు లేదా ప్రచారకులు హాజరు కారాదని, లౌడ్ స్పీకర్లు వాడకూడదని తెలిపారు. ఒపీనియన్ పోల్ లేదా ఇతర పోల్ సర్వే ఫలితాలతో సహా ఏదైనా ఎన్నికల విషయాన్ని ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రదర్శించారాదని అన్నారు. మీడియా సమావేశాలు, ఇంటర్వ్యూ ద్వారా ఎన్నికలకు సంభందించిన విషయాలపై మీడియాను ఉద్దేశించి ప్రసంగించ రాదన్నారు. ఓటర్లకు ఉచిత రవాణా అందించడానికి వాహనాలు అద్దెకు తీసుకోవడం, ఉపయోగించడం నేరమన్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం

విశాలాంధ్ర - యలమంచిలి: ఈనెల 13వ తేదీన జరుగు అసెంబ్లీ, పార్ల మెంటు ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారిని ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. యలమంచిలి అసెంబ్లీ పరిధిలో 13వ తేదీన జరుగు ఎన్నికలకు 246 పోలింగ్ స్టేషన్లలో 2,06,349 మంది ఓటర్లు ఓటు వినియోగించుకోనున్నారు. యలమంచిలి మండలం 67 పోలింగ్ స్టేషన్లో 56, 656 ఓటర్లు, రాంబిల్లి మండలం 51 పోలీస్ స్టేషన్‌లు, ఓటర్లు 42,134. అచ్చుతాపురం మండలం 57 పోలింగ్ స్టేషన్లు, 62,190 మంది ఓటర్లు, మునగపాక మండలం 57 పోలింగ్ స్టేషన్లు, 45,414 మంది ఓటర్లు, నియో జకవర్గం మొత్తం నాలుగు మండలాల్లో 49 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించి 49 చోట్ల మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారి మనోరమ అన్నారు. రూట్ ఆఫీసర్లు 21 మంది, రిజర్వుడు 2, సెక్టర్ ఆఫీసర్లు 21, రిజర్వుడు 2, అలాగే ప్రతి బూత్‌కి బూత్ లెవెల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ అధికారులు సిబ్బంది ఉంటారని ఎన్నికల అధికారి మనోరమ తెలిపారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎన్డీఏ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

విశాలాంధ్ర - వి.మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలువేల్పు మాడుగుల శ్రీమోదకొండమ్మ అమ్మవారిని అనకాపల్లి పార్లమెంట్ కూటమి అభ్యర్థి సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వీరికి అమ్మవారి మెమొంటో అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు, టీడీపీ ఇన్చార్జ్ పివిజి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలోని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలకు పోటీ చేయుచున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి వారిని కోరారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి ఏజెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్, రాకేష్ కుమార్ సమక్షంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 72 గం.ల సమయంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం మొదలైనవి నిషిద్ధమని చెప్పారు. అయితే 144 సెక్షన్ అమలులోనున్నందున నలుగురికి మించకుండా ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చన్నారు. నేటి సాయంత్రం 6 గం.ల నుండి ఎన్నికల ప్రచారానికి తెరపడుతుందని తెలిపారు. ఓటర్లపై ఎలాంటి ప్రభావం ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఎన్నికల కమీషన్ 48 గంటల సైలెన్స్ పీరియడ్‌ను అమలు చేస్తోందన్నారు. సైలెన్స్ పీరియడ్ శనివారం సాయంత్రం 6.00 గంటలకు ప్రారంభమై మే 14న ముగుస్తుందన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, 126 ప్రకారం 48 గంటల ముందు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మాధ్యమాల్లో ప్రసారాలు నిషిద్ధమని చెప్పారు. నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. వెలుపల నుండి వచ్చిన రాజకీయ పార్టీల కార్యకర్తలు ఇతర ప్రచార కార్యకర్తలు, ఓటర్లు కాని వారు వెళ్లిపోవాల్సి వుంటుందన్నారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సమాచారం అందితే వెంటనే తెలియజేయవచ్చు అన్నారు. విచారణ అనంతరం దోషులుగా నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయన్నారు. పోలింగ్ బూత్‌ను కనుగొనడంలో ఓటింగ్ ప్రక్రియను అర్థం చేసుకోవడంలో సహాయానికి సహాయక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. వృద్ధ, వికలాంగ ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, పోలింగ్ స్టేషన్లో ర్యాంప్‌లు, సహాయకులు వీలైర్ సౌలభ్యాన్ని కల్పించామన్నారు. మే 13వ తేదీన పోలింగ్ సజావుగా, సురక్షితంగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగింది. అర్హులైన ఓటర్లందరికీ పోలింగ్ స్టేషన్ల వద్ద సురక్షితంగా ఓటు హక్కు వినియోగించుకునే ప్రశాంత వాతావరణాన్ని కల్పించడం జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణకు గాను జిల్లా అంతటా పటిష్ట భద్రతా నిబంధనలు అమలులో వున్నాయి. సెన్సిటీవ్ పోలింగ్ స్టేషన్ల వద్ద అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం అభ్యర్థుల సందేహాలకు పరిశీలకులు సమాధానాలిస్తూ అభ్యర్థులు తెలియక చేసినా, ఎవరు వారి తరపున ఏవిధమైన ప్రచారం నిర్వహించినా అభ్యర్థులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంటు మెంబరుగా పోటీచేయుచున్న అభ్యర్థులు, అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.రామ్మూర్తి, డిటి రవిబాబు, ఎస్.ఏ.తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరంలో పట్టుబడ్డ రూ.7 కోట్లు ఎవ్వరివి..?

వివి లక్ష్మినారాయణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ, ఇప్పుడు ఓట్లు కోసం డబ్బుతో ప్రజలను మభ్యపెడుతున్న సంగతి అందరికి తెలిసిం దేనని, ఈ ప్రక్రియలో భాగంగా విశాఖ ఉత్తర నియోజ కవర్గంలో రూ.7 కోట్లు పట్టుబడినట్టుగా ప్రచారం జరుగు తోందని, కొందరు రూ.11 కోట్లు అని కూడా ప్రచారం చేస్తున్నారని, ఈ డబ్బు అధికారపార్టీకి చెందిన ఎంఎల్ఏ అభ్యర్థికి చెందినది కాబట్టే ధన బలంతో మీడియాలో రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారని, ఈ విషయంపై జై భారత్ పార్టీ విశాఖ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి జెడి లక్ష్మీనారాయణ స్పందిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఓటు వేసి తమ నాయకుడిని ఎన్నుకోవాల్సిన పరిస్థితిలో దానికి పూర్తి భిన్నంగా రాజ్యాంగ విరుద్ధంగా డబ్బుతో మద్యంతో అనేక రకాలుగా ప్రజలను మభ్యపెట్టడం అనేది ఈ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే అని ఆయన అన్నారు. ఈ పరిస్థితిలో ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్య తీసుకొని ఆ రూ. 7 కోట్లు చెందిన వివరాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలను తీసుకొని, నిజాలను ప్రజల ముందు పెట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా వుందనీ, డీజీపీ మారిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన ప్రచారంలో భాగంగా "ఈ ఎన్నికలు సజావుగా జరగవు" అని స్వయంగా వ్యక్తం చేసిన ఇదే ముఖ్యమంత్రి , ఇప్పుడు పట్టుబడ్డ పెద్దమొత్తం విషయంలో ఎందుకు ఖండించడం లేదన్నారు. ప్రజల్లో అనేక సందేహాలు కలుగుతున్నాయి ఇంత పెద్ద మొత్తంలో డబ్బు పట్టుబడినప్పుడు, పూర్తి విచారణ జరిపి వాస్తవాలు బయటపడే పక్రియలో కాలయాపన చెయ్యకుండా, అవసరం అయితే విశాఖ ఉత్తర నియోజకవర్గం యొక్క ఎన్నికల ప్రక్రియను వాయిదా వెయ్యాల్సినదిగా ఎలక్షన్ కమిషన్ చర్య తీసుకుంటే నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే కాకుండా ప్రజల్లో కూడా వ్యవస్థల మీద గౌరవం పెరుగుతుందని ఆయన అన్నారు. లేదంటే ప్రజాస్వామ్యంలో సమాజానికి ఏదైనా మంచి చెయ్యాలనే ఉద్దేశంతో రాజ్యాంగబద్ధంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే విధంగా కష్టపడి పని చేసే వారు గాని యువత గాని రాజకీయాల్లోకి ముందడుగు వేసి ఆలోచన చేసే అవకాశం వుండదని ఫలితంగా భారతదేశం అవినీతి ,రౌడీయిజం, డ్రగ్స్, మాఫీయాలతో కురుకుపోతుందని ఆయన తెలిపారు. ఇదే విషయంపై మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ విషయంలో విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఉద్యోగస్తులు తాము వేసిన ఓటును తమ ఫోన్ ద్వారా ఫోటో తీసి ఆయా పార్టీల కార్యకర్తలకు పంపి డబ్బులు కూడా పొందుతున్నారని కొంతమంది ఓటర్లు తన దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్ల గా ఇ ఈ సి వెంటనే చర్య తీసుకొని ఆ ప్రక్రియను నిలుపుదల చేసిన సంగతి అందరికి తెలిసిందే! ఇప్పుడు ఈ పట్టుబడ్డ పెద్ద మొత్తంలో ఎలక్షన్ కమిషన్ ఏ చర్య తీసుకుంటుందో అని ప్రజలు వేచి చూస్తున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం: ఆర్ఓ గీతాంజలి

ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

విశాలాంధ్ర - నక్కపల్లి: పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియ ఏర్పాట్లను ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ఆర్ఓ కే.గీతాంజలి ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సారథ్యంలో అణువణువు పరిశీలిస్తూ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్. రాయవరం, కోటఉరట్ల మండలాలు ఉండగా వాటికి సంబంధించి 292 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎంత రెండు లక్షల 50వేల 744 మంది మంది ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ఉండేటట్లు ఓటర్లు కి ఇబ్బంది కలగకుండా జరిగేటట్లు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో లక్ష ఇరవై మూడు వేల 363 మంది (పురుషులు) ,1,27 379 మంది (స్త్రీలు) ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసి తిరిగి వెళ్ళేటట్లు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎండ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేకమైన టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆర్.ఓకే గీతాంజలి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 292 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని, పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఈవీఎం తీసుకొని వెళ్లేందుకు స్థానిక జూనియర్ కళాశాలలో పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేశామని, అక్కడి నుంచే ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది పోలింగ్ సామాగ్రితో బయలుదేరి వెళ్తారని తెలిపారు. 28 రూట్లు, 28 జోన్లు, 28 మంది సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షణలో ఈ పోలింగ్ జరుగుతుందని, పోలింగ్కు సుమారు 1700 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని ఆమె చెప్పారు. ఆయా రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు ఏర్పాటు చేసుకునేందుకు మొదటి రోజు సాయంత్రం పిఓ కు ధృవపత్రం అందజేయాలని, ఆ మేరకు

ఎంపికైన ఏజెంట్లు పోలింగ్ కేంద్రాలకు సోమవారం ఉదయం ఐదు గంటలకే చేరుకోవాలని సూచించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6:00 వరకు ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు పోలింగ్ కొనసాగుతుందని, ఒకానొక పరిస్థితుల్లో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో సమయం ముగిసేసరికి ఓటర్లు బార్లు తీరు ఉంటే చివరి వ్యక్తికి టోక్నిచ్చి పోలింగ్ పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేటట్లు ప్రజలు ఓటర్లు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా నక్కపల్లి పాయకరావుపేట, ఎస్. రాయవరం, సిఐ లు అప్పలరాజు, అప్పన్న ,అంబటి విజయకుమార్ మాట్లాడుతూ ప్రధానంగా ఈ ఎన్నికలకు సంబంధించి పాయకరావుపేట నియోజకవర్గంలో సమస్య అధికమైన గ్రామాల పట్ల ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని చెప్పారు. పెద్ద ఎత్తున ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్లు దాటి ఎవరూ లోపలికి రావడానికి వీలులేదని వారు హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో ఎన్నికల నియమ నిబంధనలకు సంబంధించి ఓటర్లు వ్యవహరించాల్సిన తీరు తెన్నులు లపై తెలియజేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ,డిఎస్పి ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశామని చెప్పారు. ఆర్.ఓకే. గీతాంజలితోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే.శ్రీకాంత్ ,తాసిల్దార్లు సూర్యనారాయణ, జానకి, రమణారావు, ఎలక్షన్ డిటి చైనలు, డిడి సత్యనారాయణ , ఆర్ ఐ కన్నబాబు తదితరులు ఉన్నారు.

ఎన్నికలు ధర్మానికి అధర్మానికి జరిగే యుద్ధం

ఉత్తర నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రానున్న ఎన్నికలు ధర్మానికి అధర్మానికి మధ్య జరిగే యుద్ధమని వైసీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. ఈ మేరకు బాలయ్య శాస్త్రి లేఔట్ వద్దనున్న ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణు కుమార్ రాజు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి నాయకులకు ఓటమి భయం వెంటాడుతుందని దీంతో అనైతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో ఒక జాతీయ పార్టీకి సంబంధించి ఎమ్మెల్యేగా ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన విష్ణుకుమార్ రాజు ఉత్తరాంధ్ర అభివృద్ధికి వెలగబెట్టింది ఏముందని ప్రశ్నిం చారు. 2019 ఎన్నికల సమయంలో నేను ఓడిపోయిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఇచ్చిన హామీలు నియోజకవర్గంలో 95% నెరవేర్చానని అన్నారు. 1480 కోట్లు పెట్టుబడితో ప్రసిద్ధి చెందిన రాహేజ గ్రూప్ వారి ఇనార్బిట్ మాల్, రహేజా ఐటి టవర్, రహేజా కన్వెన్షన్ హాల్ ఏఎంసీ మాల్ తీసుకువచ్చి ఈ నియోజకవర్గాన్ని దశదిశ మార్చానని అన్నారు. ఇవన్నీ పూర్తయితే సుమారు రోజుకి 50,000 మంది పైబడి పర్యాటకలు వచ్చే అవకాశం ఉందని, తద్వారా 15,000 మందికి ఉపాధి అవకాశాలు రావడంతో పాటు స్థానిక వ్యాపారులకు అన్ని రకాల లాభదాయకంగా ఉండే అవకాశం ఉందని అన్నారు.

తూర్పులో అట్టహాసంగా ముగిసిన ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ తూర్పు నియోజకవర్గం లో శనివారం ఎన్నికల ప్రచారం అట్టహాసంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక జీవీఎంసి 18వ వార్డు అప్పుగర్ జంక్షన్ నుంచి పలుప్రాంతాల్లో విశాఖ తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం వి వి సత్యనారాయణ సతీమణి, ముళ్ల పూడి నాగ జ్యోతి, ఆయన తనయుడు ముళ్ళపూడి శరత్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని స్థానికులను అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలపై ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు.అదేవిధంగా మహిళలలు ఆడపడుచులు హరతులు ఇస్తూ బొట్టుపెట్టి మరల ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు తమ సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన 100 శాతం హామీలు నెరవేర్చి పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా విశాఖ పరిపాల రాజధాని కావాలన్నా మరలా ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని ప్రతి ఒక్కరు ఆశీర్వదించాలన్నారు.

జగనన్నను మరల ముఖ్యమంత్రిగా ఆశీర్వదించండి

విశాలాంధ్ర విశాఖ సిటీ: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని వైసీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం 22 వ వార్డ్ పిఠాపురం కాలనీ, తార మస్జీద్ ప్రాంతాల నుండి విశాఖ వైసిపి పార్లమెంట్ అభ్యర్థిని బొత్స ఝాన్సీ గారితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానికి సీఎం జగనన్న కట్టుబడి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచిన తరువాత విశాఖలోనే సీఎం ప్రమాణ స్వీకారం ఖచ్చితంగా ఉంటుంది అని, సీఎం జగనన్న నిర్ణయాలు ఉత్తరాంధ్ర అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. చంద్రబాబు ఏనాడూ ఉత్తరాంధ్రను పట్టించుకోలేదు అని అన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు కూడా ఏపీ సీఎం జగనన్నకు మద్దతు తెలపాలని అన్నారు. అనంతరము తారా మసీదులో ఇరువురు కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ పాల్గొన్నారు.

చందనోత్సవం విజయవంతం: ఈఓ

విశాలాంధ్ర- సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి చందనోత్సవం విజయ వంతం చేయడంలో భాగస్వాములైన అధికారులు సిబ్బంకి ఈఓ శ్రీనివాస్‌మూర్తి ధన్యవాదాలు తెలిపారు. సామాన్య భక్తులకు చందనోత్సవం రోజున ఎటువంటి సౌకర్యాలు కలుగకుండా సులభతరమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే మొదటి ప్రాధాన్యత అంశంగా తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా చందనోత్సవం ఏర్పాటు చేయడంలో అవసరమైన ప్రణాళికలు ముందుగా తయారు చేసుకొని అధికారుల అనుమతులు తీసుకోవడం జరిగిందన్నారు. కమిషనర్ దేవాదాయ శాఖ వారు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం జిల్లాలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమన్వయ సమావేశంలో తెలిపిన అంశాలను పరిగణలోకి తీసుకుంటూ వివిధ శాఖలను సమన్వయం చేసుకుని విజయవంతం చేసినట్టు తెలిపారు. అక్షయ తృతీయ రోజున 1,10,000 మంది భక్తులు స్వామి వారి నిజ రూప దర్శనం కల్పించినట్టు తెలిపారు. చిన్న జీయర్ స్వామి వారు, శ్రీ శారదా పీఠం స్వరూపానంద సరస్వతి స్వామీజీ వారు స్వామివారిని దర్శించుకున్నారు. ముఖ్యంగా గత సంవత్సరం చందనోత్సవంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చందనోత్సవం విజయవంతం చేయటానికి దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త వారు, కమిషనర్ దేవాదాయ శాఖ వారు, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

డిస్ట్రిబ్యూషన్, కేంద్రాల వద్ద ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మెటీరియల్ తీసుకెళ్లేందుకు, తిరిగి స్వీకరించేందుకు అనుగుణంగా ఏయూలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంల పంపిణీకి సంబంధించి ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ క్యాంపస్ లో ఏడు డిస్ట్రిబ్యూషన్, ఏడు రిసెప్షన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మే 13న జరగనున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఆదివారం ఉదయం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున శనివారం సాయంత్రం పరిశీలించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలకు, నోడల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా మెటీరియల్ పంపిణీ క్రతువు సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. సిబ్బంది వచ్చేందుకు, వెళ్లేందుకు.. మెటీరియల్ తీసుకునేందుకు అనువుగా ఎక్కడిక్కడ నియోజకవర్గాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు వహించాలని అక్కడ అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.

బిజెపిలో చేరిన ఎం.కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు గొల్లవిల్లి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజేష్ శనివారం అనకాపల్లి ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా రాజేష్‌కు సీఎం రమేష్ పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో తన గెలుపునకు, ఎమ్మెల్యేగా బండారు సత్యనారాయణమూర్తి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రతి పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని స్థానిక సీఐ టీవీ తిరుపతిరావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 6 గంటల నుండి 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. 13వ తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, పోలింగ్ బూత్ నుండి 100 మీటర్ల వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలందరూ సహకరిం చాలన్నారు. శాంతిభద్ర తలకు విఘాతం

కలిగించినా, ఇతర అడ్డంకులు కల్పించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద, పరిసర ప్రాంతాలలో సి.సి కెమేరాలు, బాడీవార్న్ కెమేరాలు వినియో గించి అవాంఛనీయ ఘటనలు, నేరాలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహిం చేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని తెలిపారు.

చోడవరం ఎన్నికల బరిలో ఇద్దరు తోడు దొంగలు

- ఓటును స్వచ్ఛందంగా వేసి .. దేశాన్ని కాపాడండి
- ప్రత్యామ్నాయం వైపే ప్రజల చూపు
- భారత కూటమి అభ్యర్థిని గెలిపించండి
- సీపీఐ నేత రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర - చోడవరం: భారత కూటమి బలపరచిన అభ్యర్థిని గెలిపించి, బూర్జువా రాజకీయ పార్టీలను తరిమి కొట్టి, దేశాన్ని కాపాడవలసిందిగా సీ.పీ.ఐ జిల్లా సమితి సభ్యుడు, ఏ.పి. జిల్లా రైతు సంఘం కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు కార్మిక, కర్షక, అనుబంధ ప్రజా సంఘాలు, ప్రజలకు పిలుపునిచ్చారు. అభివృద్ధి మాట దేముడెరుగు, చోడవరం నియోజక వర్గాన్ని ఇద్దరు మాజీ ఎమ్మెల్యే లు, కుటుంబ సభ్యులు, అనుచరులు ఏ విదంగా దొచ్చుకున్నారో ప్రజలందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అని తెలిపారు. వీరికి తోడు మరో ఆర్థిక నేరగాడు కడప ఫోర్జరీ కింగ్ టి.డి.పీ. కూటమి నుండి బి.జే.పి. తరఫున పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న సి.ఎం.రమేష్ నిలబడ్డారని అన్నారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియతో మాట్లాడుతూ చోడవరంలో పోటీ చేస్తున్న తెలుగుదేశం కూటమి అభ్యర్థి, వైసిపి అభ్యర్థులకు ఓటు వేయడం వలన చోడవరం పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. చోడవరం నియోజవర్గంలో పోటీ చేస్తున్న టి.డి.పి. కూటమి అభ్యర్థి కె.ఎస్.ఎన్.రాజు, వై.ఎస్సార్ అభ్యర్థి తాజా మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీలు ఇద్దరూ తోడు దొంగలని తెలియజేసారు. దొంగా దొంగా ఊర్లు పంచుకు న్నట్లుగా చోడవరం నియోజకవర్గంలో ఇద్దరు మాజీ శాసనసభ్యులు రియల్ ఎస్టేట్, మైనింగ్, లిక్కర్, ఇసుక మాఫియాకు డాన్ లుగా వ్యవహరిస్తూ చీకటి సామ్రాజ్యం ఏలారని తెలియజేసారు. పైకి బద్ద వైరం నటిస్తూ తెర వెనుక ఇద్దరు చీకటి వ్యాపారాల్లో భాగ స్వామ్యులుగా, తెర వెనుక మంచి మిత్రులుగా ఇద్దరూ ఇద్దరేగా ఎవరు గెలిచినను వారి చీకటి వ్యాపారానికి వారే రాజులుగా, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేయడంపై సిపిఐ పార్టీ అనకాపల్లి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు తీవ్రంగా ఖండిస్తున్నారు. చోడవరం అభివృద్ధి చెందాలంటే టి.డి.పి. కూటమి అభ్యర్థి, వై.సి.పి. అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. చోడవరం నియోజక వర్గాన్ని ఏ విధంగాను అభివృద్ధి చెందనివ్వకుండా పది సంవత్సరాలు కె.ఎస్ ఎన్. రాజు మైనింగ్, ఇసుక వ్యాపారంతో విజయరామరాజు పేట వద్ద బొడ్డేరు వంతెన, గవరవరం వద్ద శారద నది పై వంతెనలు కూలదోస్తే, ఐదు సంవత్సరాల కాలంలో కరణం ధర్మ శ్రీ వడ్డాది వద్ద పెద్దేరు నది పై వంతెన, విజయరామరాజు పేట వద్ద తాచేరు నది పై వంతెనలు కూలదోసారన్నారు.

రియల్ ఎస్టేట్ మాఫియాతో ప్రభుత్వ భూములు, రస్తా గోర్జి, చెరువులు దురాక్రమణ చేసి యధేచ్ఛగా తెగనమ్మేసుకున్నారని తెలియజేసారు. బానయ్య కోనేరు లో పేదలకు, స్థానిక విలేఖరులకు ఇళ్ల పట్టాలు ఇస్తానంటూ సుమారు వెయ్యి మందికి పైగా అమాయక ప్రజలను మోసం చేసిన ఘనత మన మాజీ ఎమ్మెల్యే కె. ఎస్.ఎన్.రాజు(ఉరఫ్ బాబు) దే అని తెలిపారు. రాష్ట్రంలోని సహకార రంగంలో అగ్రగామిగా నడుస్తూ, చోడవరం మాడుగుల నియోజకవర్గాల్లో కొన్ని లక్షల కర్షక, కార్మిక కుటుంబాలకు ఉపాధిని చూపే గోవాడ సుగర్స్‌ను చోడవరం ఇరు పార్టీల శాసనసభ్యులు, మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు వారి అనుచర కుటుంబ బృందాలు అడ్డగోలుగా దోచుకుని, ఈ రోజు కార్మిక, కర్షకులకు పేమెంట్లు ఇవ్వలేని పరిస్థితిలో దివాళా దిశగా అడుగులు వేయించిన ఘనత మన మాజీ శాసన సభ్యులదే అని తెలిపారు. గోవాడ సుగర్స్ ను పూర్తిగా నాశనం చేసి, యంత్రాల విడి భాగాలు స్క్రాప్ కూడా అమ్ముకుంటున్న శాసన సభ్యులున్న సందర్భంలో చెరుకు రైతులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది అన్నారు. అదే విధంగా గ్రానైట్ క్వారీలకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ధర్మ శ్రీ సహకారంతో అనుమతులు పొందిన టి.డి.పి. ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు కళ్యాణపులోవ రిజర్వాయర్‌కు సాగు నీరు చేరకుండా, రాజా వారి క్వారీల చుట్టూ గల రైతాంగాన్ని నానా ఇబ్బందులకు గురి చేస్తూ వ్యవసాయాలు పూర్తిగా

నష్టపోయినను, దర్జాగా పదేళ్ళ మైనింగ్ క్వారీ వ్యాపారం చేసారన్నారు. చోడవరం నుండి అనకాపల్లి వెళ్లే వరకు ఎమ్మెల్యే రాజు క్వారీ నుండి అధిక రాయిలోడుతో రవాణా చేసి రోడ్లను పూర్తిగా నాశనం చేసారని, తన అనుచరులుచే జీవ నదుల్లో అక్రమ ఇసుక తవ్వకాలతో వ్యాపారాలు చేయించి బ్రిడ్జిలు కింద ఉన్న ఇసుకను పూర్తిగా తవ్వించి, బ్రిడ్జిలు పడి పోవడానికి కారణమైన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు మరలా ఈ చోడవరం నియోజకవర్గంలో ఏ విధంగా పోటీ చేస్తారని ప్రశ్నించారు. చోడవరం నియోజక వర్గం ప్రజల్ని పిచ్చివాళ్ళు అని అనుకుంటున్నారా, నేతల మంటూ మేత మేసే అక్రమార్కులకు తగిన రీతిలో తమ ఓటు తో బుద్ధి చెప్పాలన్నారు.

తాజాగా చోడవరం బి.ఎన్.రోడ్డుకు ఆనుకుని వున్న ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద పాత చెరువును ఇరు పార్టీల మాజీ ఎమ్మెల్యేలు దురాక్రమణ చేసి బడా బాబులకు ఒప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇరువురు చీకటి వ్యాపార మిత్రులు చెరొక పార్టీ వైపు పోటీ చేసి, ఎవ్వరు గెలిచినను మరొకరికి ఉపయోగపడే విధంగా చీకటి ఒప్పందాలు చేసుకోవడం, దానికి అభిమానులు, కార్యకర్తలంటూ అమాయక ప్రజలను బలి చేయడం విడ్డూరంగా ఉందని తెలియజేసారు.

వామపక్ష పార్టీలతో కూడిన భారత కూటమి అభ్యర్థి జగతా శ్రీనివాసరావును హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.